

# తడిసి ముద్దయిన తెలంగాణ






## రాష్ట్ర వ్యాప్తంగా అతి భారీ వర్షాలు

- పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు
- రహదారులన్నీ జలమయం ప్రాజెక్టులకు భారీ వరద
- పలు చోట్ల రోడ్లపై కొట్టుకుపోతున్న వాహనాలు
- రైళ్ల రాకపోకలకూ తీవ్ర అంతరాయం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న సీఎం
- అధికారులు సెలవులు పెట్టొద్దని ఆదేశాలు
- క్షేత్రస్థాయిలో తిరిగి సహాయక చర్యలు చేపట్టాలని సూచన

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

బంగాళా ఖాతంలో వాయుగుండం ఎఫెక్ట్‌తో తెలంగాణను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వానలు దంచి కొడుతున్నాయి. వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. వానలకు రాష్ట్రంలోని పలు ప్రధాన రహదారులు జలదిగ్బంధమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో పలు గ్రామాలు నీట మునిగాయి. పంట పొలాలను వరద ముంచెత్తింది. పలు ప్రాంతాల్లో ప్రజా రవాణా స్తంభించిపోయింది. ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులకు భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

**చుట్టూ నీళ్ల మధ్య రాత్రంతా బస్సులో...**

భారీ వర్షాలకు వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపురం వద్ద తోపనపల్లి చెరువు పొంగడంతో వరద నీటిలో ఓ ఆర్టీసీ బస్సు చిక్కుకుపోయింది. శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో వేములవాడ నుంచి మహబూబాబాద్‌కు వెళ్తున్న ఈ బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. చికట్లో ఎటు వెళ్లలేని పరిస్థితి ఏర్పడటంతో రాత్రంతా బస్సులోనే ఉన్నారు. ప్రయాణికులు ఈ ఘటనకు సంబంధించి ఓ వీడియోను రూపొందించి తమను కాపాడాలని అధికారులకు విన్నవించుకున్నారు. బస్సులో చిన్న పిల్లలు, వృద్ధులు ఉన్నారని, నిన్నటి నుంచి నీళ్లు, ఆహారం లేకుండా ఉన్నామని తమ గోడు వెళ్లబోసుకున్నారు. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ ఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్ సహాయంతో ప్రయాణికులను రక్షించారు. ప్రయాణికులను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు తరలించి, వర్షం తగ్గాక బస్సులో పంపిస్తామని చెప్పారు.

**తెగిపోయిన రైల్వే ట్రాక్..**

వర్షాల కారణంగా మహబూబాబాద్ జిల్లాలో రహదారులన్నీ జలమయమయ్యాయి. కేసముద్రం మండలంలో రైల్వే ట్రాక్ పూర్తిగా కొట్టుకుపోయింది. మట్టి కోతకు గురవడంతో ట్రాక్ కింది నుంచి వరద ప్రవహిస్తోంది. దీంతో విజయవాడ కాజీపేట మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. తాళ్లపూసలపల్లి వద్ద రైల్వేట్రాక్‌పై నుంచి వరద ప్రవహిస్తుండటంతో పందిపల్లి వద్ద మహబూబ్‌నగర్‌విశాఖ ఎక్స్‌ప్రెస్ నాలుగు గంటల పాటు నిలిచిపోయింది. మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో మచిలీపట్నం, సింహపురి రైళ్లు నిలిచిపోయాయి. దాదాపు 18 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. మహబూబాబాద్ మండలం అయోధ్యలో చెరువు కట్ట తెగివరి పంట మొత్తం నీట మునిగాయి. రావిరాల గ్రామం పూర్తిగా నీట మునిగింది. సాయం కోసం ప్రజలు ఇళ్లపైకి ఎక్కారు. తమ బంధువులకు ఫోన్ చేసి తమను కాపాడాలని చెప్పగా సహాయక చర్యలు ప్రారంభించారు.

**కొట్టుకుపోయిన కారు.. వ్యక్తి మృతి**

సూర్యాపేట జిల్లా కోదాడ టౌన్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు రెండు కార్లు, ఆటో వరదకు కొట్టుకొచ్చాయి. ఇందులో ఓ కారులో ఒక మృతదేహం ఉన్నట్లు అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. గాంధీనగర్ కి చెందిన నాగం రవి అనే వ్యక్తి కారులోనే కొట్టుకుపోయి మృతి చెందినట్లు వచ్చారు.

**శ్రీశైలంలో విరిగిపడిన కొండచరియలు..**

శ్రీశైలం జలాశయం సమీపంలో భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడ్డాయి. ఈగలపెంట రహదారి మార్గంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే శ్రీశైలానికి వచ్చే తెలంగాణలోని మున్ననూరు ఫారెస్ట్ చెక్ పోస్ట్‌ను రాష్ట్ర అటవీ శాఖ మూసేసింది.

**పలు జిల్లాలకు రెడ్ అలర్ట్....**

భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆదివారం రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఆదిలాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని రెడ్ అలర్ట్ జారీ చేసింది. కుమురం భీం, మంచిర్యాల, జగిత్యాల, జయశంకర్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, జనగామ, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు ఎల్లో అలర్ట్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రానికి వాయుగుండం ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రానున్న 24 గంటల్లో వాయుగుండం తెలంగాణ మీదుగా కదలనుంది. భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్, విజయవాడ జిల్లాల్లో జాతీయ విపత్తు స్పందన దళాలు మోహరించాయి.

**24 గంటల్లో వరదలు....**

ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, జగిత్యాల, జనగాం, ఖమ్మం, కుమురం భీం, మహబూబాబాద్, మంచిర్యాల, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్ గ్రామీణం, వరంగల్ జిల్లాలో రానున్న 24 గంటల్లో భారీ వరదలు ముంచెత్తే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

**అధికారులు సెలవులు పెట్టొద్దు...**

వర్షాలపై సీఎం రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసారు. ఈ మేరకు సీఎం అత్యవసర సమీక్ష నిర్వహించారు. మంత్రులు భట్టి, ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల, దామోదర రాజనర్సింహ, జూపల్లి టెలి కాన్ఫరెన్స్ ద్వారా వివరాలు సేకరించారు. సీఎస్, డీజీపీ, మున్సిపల్, కరెంట్, పంచాయతీ రాజ్, హైడ్రా, ఇరిగేషన్ అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. అధికారులంతా 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీలు, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. అధికారులు ఎవరూ సెలవులు పెట్టొద్దని, సెలవులు పెట్టిన వారు వెంటనే రద్దు చేసుకొని వెంటనే విధుల్లో చేరాలని సీఎం ఆదేశించారు. జిల్లాల వారీగా ఎప్పటికప్పుడు సమాచారాన్ని సీఎంఓకు పంపాలన్నారు. అత్యవసర పనుకుంటే తప్ప ప్రజలు ఎవరూ బయటకి రావొద్దని విజ్ఞప్తి చేసారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యల్లో పాల్గొనాలన్నారు.

**సోమవారం విద్యాసంస్థలకు సెలవు...**

రాష్ట్రంలో మరో రెండు, మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటించింది.

**ఆకేరు వాగులో ఐదుగురు గల్లంతు...**

ఖమ్మంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తీర్థాలలోని ఆకేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. వాగును చూడడానికి వెళ్లిన ఐదుగురు వ్యక్తులు నీటిలో గల్లంతయ్యారు. మొదట ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చిన బాధితులు ప్రస్తుతం ఫోన్‌లో కూడా అందుబాటులో లేరు. గల్లంతైన వారిలో మధు, గోపి, బన్నీ, వీరబాబులతో పాటు మరో వ్యక్తి ఉన్నారు. రెస్క్యూ టీం సహాయక చర్యలు చేపట్టింది.

**ప్రాజెక్టులకు భారీ వరద...**


నిర్మల్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వరద ఉధృతి తీవ్రమైంది. దీంతో అధికారులు 10 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు భారీ వరద పోటెత్తడంతో అధికారులు 10గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు . నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి సాగర్ 26 గేట్లు ఎత్తివేసి నీటిని దిగువలకు విడుదల చేస్తున్నారు. 12గేట్లు 10 అడుగులు, 14గేట్లు 10 అడుగుల మేర ఎత్తి వేశారు. సూర్యాపేట జిల్లాలో ప్రవహించే సాగర్ ఎడమ కాల్వకు గండి పడింది. వరద ఉధృతి ఎక్కువై నడిగూడెం మండలంలోని రామచంద్రపురం వద్ద సాగర్ ఎడమ కాల్వకు గండిపడింది. దీంతో వరద నీరు పంట పొలాల ద్వారా మెల్లగా గ్రామంలోకి చేరుకుంటోంది. సమాచారం అందుకున్న ఇరిగేషన్ అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని సహయక చర్యలు ప్రారంభించారు.















**హుస్సేన్ సాగర్ ఫుల్...**

హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. బంజారాహిల్స్, పికెట్, కూకట్‌పల్లి నాలాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో సాగర్‌కు భారీగా వరద చేరుతోంది. నీటిమట్టం ఫుల్ ట్యాంక్‌లెవల్ దాటడంతో తూముల ద్వారా నీటిని మూసీలోకి వదులుతున్నారు. దీంతో మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను జీహెచ్‌ఎంసీ అప్రమత్తం చేసింది. హుస్సేన్‌సాగర్ ఫుల్ ట్యాంక్ లెవల్ 513.41 మీటర్లు కాగా, ప్రస్తుతం 513.43 మీటర్లుగా ఉంది.






EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999